(న్యూజెర్సీ కథల పోటీలో 150 రూపాయలు బహుమతిగా అందుకున్న కథ)




మనిషెత్తు లోతు తవ్వి, పైన ఐదడుగుల ఎత్తులో లేపిన గనెట్ రాళ్ల కట్టడం పూర్తయింది పిల్లర్లతో పని లేకుండా అంత పెద్ద గొయ్యి నింపడానికి చాలా మట్టే అవసరమైంది.

"ఈ పనంతా ఒక ఎత్తు. క్యూరింగ్ చేయడం మరో ఎత్తూ నండయ్య. మా పోరగాడ్ని పెట్టుకుంటే సరి. రోజుకు పన్నెండు రూపాయి లియ్యాల్సొస్తది" అన్నాడు మేస్త్రీ కొండయ్య శ్రీహరిరావుతో.

"రోజుకు పన్నెండా! ఒట్టిగా నీళ్ల కొట్ట టానికి" ఆశ్చర్యంగా అన్నాడు శ్రీహరిరావు.

"మేం కొడతాంలే నాయనా నీళ్లు. ఓ వారం, పది రోజులే కదా!" ఒకేసారిగా అన్నారు అక్కడే వున్న శ్రీహరిరావు తల్లీ, తండ్రీ.

"మీ వల్లేమవుద్దమ్మా ముసలాళ్లు పాపం! పెద్ద బిల్డింగ్ కట్టబోతూ వంద రూపాయల కాడ మాసు కుంటారా ఎవరైనా" అన్నాడు కొండయ్య నిష్ఠూరంగా.

"కాదులే కొండయ్యా! వంద మిగిలినా మిగిలినట్లే కదా! పెద్ద ఖర్చులో వున్నాడు పిల్లాడు" అన్నారా వృద్ధ దంపతులు.

"సరే మీ ఇష్టం" అనెళ్లిపోయాడు కొండయ్య.

మేస్త్రీ కొండయ్యన్నా మీవల్లేమవుతుందన్నాడుకానీ, కొడుకు శ్రీహరిరావు మాత్రం మాటవరసకయినా వద్దనలేదు.

బావిలో నుండి ముసలాయన చేతులొణుక్కుంటూ నీళ్లు తోడుతుంటే, పడుతూ లేస్తూ నడుములు గుంజుతున్నా మోకాళ్లు పట్టుకుపోతున్నా లెక్క చేయకుండా ఫౌండేషనంతట్నీ ఆరంగారంగా నీటితో తడుపుతుండేది సీతమ్మ.

ఇల్లు లింటల్ లెవెల్ కొచ్చింది. ఆ తర్వాత శ్లాబ్ వేశారు. చెక్క విప్పిన తర్వాత రెండు కోటింగ్‌ల ప్లాస్టరింగు, తర్వాత ఫ్లోరింగు, కరెంట్ ఫిట్టింగ్స్, వాటర్ కనెక్షన్లూ, బోర్‌వెల్ వేయించడం, మోటార్ బిగించడం... ఒకటేమిటి? అన్నీ చకచకా అయిపోయాయి. ఇల్లు అన్ని హంగులతో పూర్తయి అందంగా తయారైంది. త్వరగా పనవుతుందని కూలీలతో పాటు మాల్ అందించడం దగ్గర నుంచి ప్లాస్టరింగ్ అయింతర్వాత, రంగులు వేసిం తర్వాత గోడలకు నీళ్లు కొట్టడం లాంటివన్నీ చేశారు శ్రీహరిరావు తల్లీ, తండ్రీ.

"ఎందుకమ్మా ఈ వయసులో మీకీ కష్టాలు, హాయిగా చూస్తూ కూర్చోక" అన నేవాడు కాదు శ్రీహరిరావు.

ఎవరూ దగ్గర లేకపోతే పనివాళ్లు సరిగా చేయరని ఎండకెండుతూ కూర్చుని పన్లు చేయించారు ఆ ముసలి వాళ్ళిద్దరూ ఓపిక లేకపోయినా.

ఒక మంచి ముహూర్తాన మాఘమాసంలో గృహప్రవేశమయ్యారు శ్రీహరిరావు దంపతులు. సత్యనారాయణస్వామివారి వ్రతం జరుపుకున్నారు. అత్తమామలకు, బావమరుదులకు, భార్య తరపు వారందరికీ ఘనంగా బట్టలు పెట్టాడు శ్రీహరిరావు.

తన కొడుకు, కోడలు, మనుమలూ, మనవరాండ్రు చల్లగా, హాయిగా వుంటే చాలనుకున్న ఆ పిచ్చి వృద్ధ దంపతులు కొడుకు వాళ్లందరి ముందూ తమను పట్టించుకోకపోయినా బాధపడలేదు. పనివాళ్లకంటే హీనంగా బట్టలు కట్టుకున్న వాళ్ళిద్దరూ తెరవెనుక వంటపన్లూ, కడుగుడుపన్లు లాంటి వాటితో తలమునకలైపోతున్నారు. అతిథులంతా భోజనాలైంతర్వాత వెళ్లిపోయారు. ముఖ్యులే వున్నారు. కొత్త నడుం వాలుద్దామని, వరండాలో వున్న మెత్తని సోఫాపై కూర్చోబోయింది శ్రీహరిరావు తల్లి సీతమ్మ.

"అయ్యయ్యో! అక్కడ పడుకోకే... మాసిపోతుందది. బోల్డు డబ్బు పెట్టి కొన్నది మరి" గాభరాగా అన్నాడు శ్రీహరిరావు ఆఫీస్ కొలీగ్స్ ముందు. ఎందుకో మనసు చివుక్కుమన్నది సీతమ్మకు.

ఆరోజు నుంచే తల్లినీ, తండ్రినీ చీటికీ మాటికీ కసురుకునేవాడు శ్రీహరిరావు. వాళ్లు నడిస్తే ఖరీదైన ఫ్లోరింగ్ మాసిపోతుందని తిట్టేవాడు. కొడుకే గౌరవించకపోతే కోడలసలు లెక్క చేస్తుందా! ఆవిడా సాధించేది సందు దొరికితే. ఇంటికొచ్చినవాళ్లకు వీళ్ళు తన తలిదండ్రులని చెప్పకోడానికే సిగ్గుపడేవాడు శ్రీహరిరావు.

అవునుమరి. తాజ్‌మహల్ గురించి చెప్పకుంటారు గానీ దాన్ని అంత అందంగా మలచిన కార్మికుల గురించి ఎవరైనా అనుకుంటున్నారా? తన అందమైన ఇంటి కోసం వాళ్లెంత శ్రమించారో ఇప్పుడు శ్రీహరిరావుకు అనవసరం.

ఇల్లు కట్టబోయే ముందు సిమెంటు, ఇనుప సామాన్లు, చెక్కలూ పెట్టుకోవడానికి ఒక రేకుల గది వేశారు. దాంట్లోకి బలవంతంగా నెట్టాడు తల్లినీ, తండ్రినీ శ్రీహరిరావు వాళ్లుంటే ఇంటి అందం చెడిపోతుందంటూ.

ఇల్లు కట్టేటప్పుడు పడ్డ శ్రమకు సరైన వైద్యం లేక, బలమైన ఆహారం లేక, అదీ వేళకు లేక కదలలేని స్థితికొచ్చారు వాళ్ళు. కొడుకు నిరాదరణ మరింత క్రుంగదీసింది. వాళ్లనక్కడ నుంచి కూడా వెళ్లగొట్టాలని ఈ ఇల్లే అమ్మాలనుకుంటున్నానని బెదిరించేవాడు వాళ్ళని. పస్తులతో ఎముకల గూళ్లలా తయారయ్యారు వాళ్ళు.

"మనిద్దరం ఎటైనా వెళ్లిపోదామండీ! ఏ అనాథ శరణాలయంలోనో చేరిపోదాం" అన్నదొకరోజు ప్రాణం విసిగిపోయిన సీతమ్మ భర్త పరంథామయ్యతో.

"ఇదేమైనా సినిమానా గమ్యం తెలియని బాటసారుల్లా దూరతీరాలకు సాగిపోవడానికి? ఇది జీవితమ్మే పిచ్చిదానా! పండుటాకుల్లాంటి మనం ఏ క్షణాన రాలిపోతామో మనకే తెలీదు. అనాథ వృద్ధుల శరణాలయంలో చేరిపోవడం అంత సులభమనుకున్నావా? చేరి మన వాడి పరువు తీయడం భావ్యమా? చెప్ప. మన జీవితాలిలా గడిచిపోవాల్సిందే వాడెట్లా ఆడిస్తే అట్లా... ఈ బ్రతుకులింతే ఇహ..." నిస్పృహాయంగా అంటూ ఎండిపోయిన పుల్లలాంటి కుడిచేయి చాచి ఎముకల గూడులాంటి సీతమ్మను ఓదార్పుగా దగ్గరకు తీసుకున్నాడు పరంధామయ్య.

— శ్రీగిరిరాజు విజయలక్ష్మి